పాడుసంసారం

కూచిభొట్ల హనుమంతరావుగారు

గోపీనాధునికి పోలీసు సబుయినస్పెక్టరుపని అయింది. ఉద్యోగం పురుషలక్షణం అనినౌకరీ చేస్తూన్నాడన్న మాటేగాని అతనికి జీవనానికి యేంలోటులేదు. భూములమీద పదిపుట్లగింజలువస్తయి. గ్రామానగరంలో పెద్దడాబాయిల్లుఉంది. తోటలు దొడ్లు ఉన్నయి. చిన్నప్పుడే పినతండ్రిభార్య వెంకాయమ్మకు పెంపుడు పోవడంవల్ల అతనితో పంచుకునేవారు, ఎంచుకునేవారు ఎవరులేరు. ఎంతో హాయిగా ఉండవలసింది. కాని అదృష్టము ఉండవద్దూ? ఇంతఉన్నా అతనిమనస్సుకు మాత్రం శాంతిలేదు. ఎప్పుడు కలవరంగానే యుండేది. ఎంచేద్దామన్నా అతనిమనస్సు ఒప్పడంలేదు. కష్టానికి సుఖానికి ఓర్చి చిన్నప్పటినుంచి పెంచి, ఆస్తిపాస్తి యిచ్చి విద్యాబుద్ధులు చెప్పించిన తల్లికా చెప్పలేదు. తనమాట ప్రకారమే నడుస్తూ, తననే దైవంగా జూచుకుంటూ, సర్వకాలసర్వావస్థలయందు తన సౌఖ్యానికే తంటాలుపడుతూ ఉన్నకాంతాన్నీ యేమనలేదు. ఏంచేస్తాడు. మధ్య నలిగిపోతున్నాడు? అటుయిటు సర్దలేక మచ్చు మాసిపోతోంది. 'నూరుపిలకలు ఒకచోట యిముడుతయిగాని, రెండుకొప్పులు మాత్రము ఒకచోట యిమడ' వనే సామెత యితనికి బాగా అనుభవం అవుతోంది. పెద్దలు యెంతో అనుభవంమీద చెప్పిన వాక్యములు ఊరకనే యెగిరిపోతయ్యా. మరి పగలంతా పోలీసుస్టేషనులో గొడవ. ప్రొద్దు కూకగానే పొయ్యివద్ద గొడవ. సన్యాసంపుచ్చుకుని యెటయినా లేచిపోదామా యనిపిస్తుండేది. ఎంతో విరక్తి పుడితేనేగాని లేక పోతే సన్యాశం పుచ్చుకోవడం కష్టంకాదూ? అతడికి ఆరోజుకారోజు యీపాడుసంసారం మీద విసుగెత్తిపోతోంది.

కాంతం కాపరానికి వచ్చి యింకా యేడాదయినా కాలేదు. ఇంట్లో ఒకటేఆగం. ఒక్కటేగోల. అత్తకోడలకు పచ్చిగడ్డివేస్తే భగ్గుమనేది. ప్రొద్దునలేచింది మొదలు ఒకళ్ల తప్పులు ఒకళ్లు వెదుకుకొంటూ కూర్చోడమేపని. కుడిచికూర్చోలేక తెచ్చుకునే పోట్లాటలేగాని వారి పెద్దలను వీరు చంపేరా? వీరి పెద్దలను వారు చంపేరా? ఏమీలేదు. చిన్నపిల్ల అవడంవల్ల యెప్పుడూ పోరుతూఉంటే యేందిగులు పడుతుందో యని జడుస్తూయుండే వాడు. కాని పైకి మాత్రం ప్రతివిషయంలో తల్లినే అనుకరిస్తూన్నట్టుగా అగుపడేవాడు.

క్రొత్తగా యేర్పడిన సంసారం అగుటచేత భార్యాభర్తల ఆలోచనలకు గుసగుసలకు అంతు అగుపడుట లేదు. రాత్రులయందు చాలాప్రొద్దు పోయ్యేవరకు, యేదోపుట్టమీదివి పురాణం మీదివి కబుర్లు చెప్పుకుంటూ, బహుకులాసాగా కాలం గడుపుతూయుండేవారు. ప్రేమసాగరమున దరితెన్నుగానక కొట్టుకుంటూయున్నారు. అనుభవించిన కొలది ప్రేమ పెరుగుచునే ఉండును గాని తగ్గదుగదా! ప్రకృతియే ప్రేమమయమగు నపుడు మానవుల సంగతి చెప్పవలసినదేమి!

పాపం వెంకాయమ్మ పెద్దది అగుటవల్ల రాత్రులయందు నిద్రపట్టేదికాదు. వాళ్లిద్దరు పిలాసాగా కబుర్లు చెప్పుకుంటూయున్నాగనిన్ని, తనతో మాట్లాడువారు ఎవ్వరు లేకనిన్ని, గొణుగుతూయుండేది. ప్రొద్దునలేచింది మొదలు కాంతంమీద యేదో ఒకనేరం మోపుతూయుండేది. తెల్లవారగట్లే లేవలేదనో— కనిబొమ్మల్లో పొట్టెట్టుకున్నదనో—నిలుచుని నీళ్లుత్రాగిందనో యేదోగాలి ప్రోగుచేసి, పెద్దనేరాలుగా గోపీనాథుడు యింటికి రాగానే జెప్పవయ్యేది. ఇలాగంటివన్నీకూడా నేరాలే!

ఏమిచెప్పినా ఒకసారి రెండుసార్లు గోప్యం. అదేపని అయితే 'గోజుచచ్చేవాడికి ఏడ్చేవాడెవడన్ని' లక్ష్యభావం తప్పిపోతుంది. తడవతడవకు యిలాగే పితూరీలు చేస్తూయుంటే, యేదో పిచ్చిముండ, అలాగ చెప్పుతూ యుంటుందని వినిపించుకోకుండా వెళ్లిపొయ్యేవాడు. అలా నిర్లక్ష్యంగా ఉండడంవల్ల కోపం మరింత హెచ్చిపోతూ యుండేది వెంకాయమ్మకు. గోపీనాథునికి కాంతం మందు పెట్టిందని, అలామందే పెట్టకపోతే యిదివరకల్లా తనమీద యెంతో గురిగాయుండేవాడు, అలానిర్లక్ష్యముగా యుండుటకు కారణం యిదగనీ, ఊరంతా యాగీచేసివస్తూయుండేది. ఏంచేస్తాడు. ఆమె కోపం చల్లార్చడానికని గోజుగోజు అన్నిటికి సుఖపెట్టే కాంతాన్ని యెక్కడ దండిస్తూ కూర్చుంటాడు.

ఎవరితో చెప్పినాగాని 'వెంకాయమ్మా! నీకెందుకాగొడవఅంతా. పెద్దదానివయి పోయినావా! ఏదో రెండుమెతుకులుతిని కృష్ణారామాయని కూర్చోక—లేనిపోని దంతాతెచ్చి నెత్తిన పెట్టుకుంటావు' అనేవాళ్లే. పోనీకాస్తోకూస్తో తప్పాతనివల్ల గూడా యున్నదనుకొన్న, పోలీసు యినస్పెక్టరు అగుటవల్ల యిది నీకు తగదని యెవరుపోయి కూకలేస్తారు? ఎవరికేంబట్టింది? కావలసినవాళ్లు పెద్దవాళ్లెవరయినా, యామె కోపం చల్లార్చడానికి. ఆమె మొగంముందట గోపీనాథుణ్ని కోపపడినా, ఆమె మొగంచాటు కాగానే అలాగి అంటేనే గాని ఊరుకోదురా లేకపోతే మమ్ములనుగూడా సాధిస్తుంది. ఎమీ అనుకోకూ అనేవారు.

పిచ్చిది అలాగే వాగుతూయుంటుంది అని ఊరుకుంటే తొండ ముదిరి ఊసరవిల్లి అయింది. ఇదివరకు వాండ్లయింటికి వీండ్లయింటికి వెళ్ళి చెప్పుకుని యేడ్చి వస్తూయుండేదల్లా, యిప్పుడు ప్రతిదానికి వీధి యరుగు మీద కూర్చుని పోట్లాడడం మొదలెట్టింది. తనయింటిలో యేలాయున్నా పొరుగింటతగవువినుట మానవ జాతికి వేడుక. అగుటవల్ల దారినిబొయ్యేవారు, యిరుగు పొరుగువారు, అందరుజేరి తమాషాచూస్తూండేవారు. ప్రతిరోజూ యిదిఒక హంగామా. నలుగురిలో తిరుగనేర్చినవారు. ఒకళ్ళకు చెప్పేవారు. అటువంటివాడు ఒకళ్ళచేత చెప్పించుకోవడం అంటే తలకొట్టేసినట్లుగా ఉండేది. మర్యాదకోసము తంటాలుపడుతూ యుండే వాడు. పేరుప్రతిష్టలకోసం ప్రాకులాడుతూయుండేవాడు. నయానాభయాన చెప్పవలెనని అనుకొన్నాడు. కాని 'ఆస్తి అప్పళించుకుంటూ తినవచ్చునుగాని మాటఅంటే పడలేరేం' అని లోకులుఅని పోతారేమోయని జడిసేవాడు. ప్రేమ అట్లాయుండనీ. ముందులోకంతో పడలేరుగదా. ప్రతీది లోకులుకేకావాలి. కాస్తయుంటే గంపంత చేస్తారు. అదుగోపులిఅంటే యిదుగోతోక అంటారు. ఏదోకోపంవచ్చినప్పుడుతప్ప సాధారణంగా తుడిచేసుకుని పోతూండేవాడు. ఆమె యేమన్నను బదులు చెప్పవద్దని కాంతానికికూడా గట్టిగా చెప్పేవాడు.

తానేమియుఅనక, కాంతాన్నీ అననీయక కట్టడిచేసేసరికి యిద్దరు తనతోమాట్లాడుటగూడ మానేశారనీ, యికఅటువంటియింట్లొఉన్నా ఒకటే లేకపోయినా ఒకటేఅనీ, అత్తకు కావలసినకోడలనా మొగునికి

కావలసిన భార్యనా అని విరుపుమాటలు సాగించింది. గోపీనాథునికి ఉరిగిన తిన్నట్టుగా ఉంది. ఆమెచారెడు యావనే వేరే కాచుకోవలసింది అని చెప్పవలెనని అనుకున్నాడు. కాని మనస్సు ఒప్పలే. ఎలాఒప్పుతుంది? చేసినమేలు మరచేవారి మచ్చులో వాడు కాడు. తల్లి అలాపిచ్చిదైపోయి సంసారం వీధిలోపెట్టుతూ యున్నందుకు చాలాపరితపిస్తూయున్నాడు కాని రోజులుమాత్రం గడిచిపోతున్నాయి. అలాయెన్నాళ్లు గడుస్తయి?

కాంతానికి నెలతప్పింది. దీనితోపాటు అన్నమందు రుచికూడా తప్పింది. ఒకపూట తినీ తినకా ఒకపూట లేచీ లేవక యిలాగఉంది, ఆమెస్థితి. ఇంట్లోచాకిరి అంతా వెంకాయమ్మ నెత్తినేపడ్డది. పాపం పెద్దదయిపోయింది. అందులో తగువులమారి సంసారం. తెగవిసుక్కుంటూయున్నది. దాసీముండకంటెకూడా హీనమైపోయినానని యిరుగుపొరుగమ్మలతో చెప్పుకుని దుఃఖోపశమనము చేసుకుంటూయుండేది.

తల్లివండుతూ యున్నదన్నా, వడ్డిస్తోందన్నా గోపీనాథునికి చాలాభయమయి పోయింది, ఏమాట మీద ఏమిటివస్తుందో, యేమి ఆగం అవుతుందోయని. అందువల్ల భోజనమునకు వచ్చేటప్పుడు, కాంతం వడ్డించేటప్పుడు మాదిరి దర్జాగారాకుండా, కాస్తభయపడుతూ యుండేవాడు. అన్నియేండ్లువచ్చి ప్రపంచంలో అంత అనుభవంసంపాదించిన ఆమె, యీమాత్రంకనిపెట్టలేదూ! ఒకనాడు తొందరపనిమీద యెచ్చటికో వెళ్లవలయునని భోజనంచేస్తూయుండగా, కనిపెట్టలేక "భార్యతో అయితే ఇష్టాగోష్ఠి చెపుతూ నవ్వుతూ త్రేలుతూ ఉండగలవుగాని, నన్ను చూచేసరికి మొగం మటమట లాడించుకుంటావు. నాపేరంటే గిట్టకొచ్చిందినీకు. ఇంతకు నిన్ను అన్నలాభంయేముంది. నిన్నుబట్టిన ప్రతిబంధకం అలాచేస్తోంది. నోటిమాట లేకుండా చేసిందిగదా, యిక కంటిచూపులేకుండా చేయడమె తరువాయి" అని సాగించింది పురాణం. ఈ సూటీపోటీ మాటలు వినేసరికి ఆతనికి భలేకోపంవచ్చింది. ఒళ్లుమండిపోయింది. ఏంచెయ్యలేక, తినే విస్తరి నేలకేసికొట్టి వంటంతా మైలపడేసి లేచిపోయినాడు పోలీసుస్టేషనుకు. ఇక ఆయింటిలో గణ్యత లేదనుకున్నది. గుడ్డాగుడుసులు చంకనబెట్టుకుని మనస్సు విరక్తిచేసుకుని 'దిక్కులేని వారలకు దేవుడేదిక్కు' అనుకుంటూ లేచి చక్కాపోయింది వెంకాయమ్మ.

కోపం చల్లారిన తర్వాత యింటికి వచ్చాడు గోపీనాథుడు. తల్లి యెక్కడకో వెళ్లిపోయిందని తెలిసింది, తాను ముందువెనుకలాలోచించక చేసినపనికి చాలాపశ్చాత్తాపపడ్డాడు, నొచ్చుకున్నాడు. మనస్సువిరిగి పోయిన తరువాత ఏది ఎట్లాపోతేనేం పోలీసువాండ్రును వెంకాయమ్మను వెదకుటకు పట్టణం నాలుగుమూలలకు పంపాడు. మనిషిని చూడక పోయినప్పటికి, యితరులు చెప్పిన గుర్తులవల్ల మనుష్యులను గుర్తించ గలిగిన పోలీసువాండ్రు తెలిసియున్న వెంకాయమ్మను—రోజూ చూస్తూయున్న వెంకాయమ్మ జాడను కనిపెట్ట లేకపోయినారు. ఇక చేసిందేమయ్యా అంటే, వెంకాయమ్మ దేనిలోనోపడి చనిపోయిందని పుకారుపుట్టించారు, ఆమె యేనూతిలోను, గోతిలోనూ, అగుపడలేదుకాబట్టి సరిపోయిందిగాని, లేకపోతే గోపీనాథుని మర్యాదమట్టిలో కలిసిపొయ్యేదే. పాపం! యేంచేస్తాడు. వెతికించి వెతికించి విసుగెత్తి ఊరుకున్నాడు.